క్లుప్తంగా

20న జాబ్ మేళా

రామచంద్రపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 20 స్థానిక వీఎస్ఎం కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి. లోక్‌మాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 3 కంపెనీలు పాల్గొంటాయన్నారు. సుమారు 230 పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ బీఫార్మసీ, పీజీ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. జిల్లాలో ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు బయోడేటా, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 99484 04165, 80965 23666, 82476 45389 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆసుపత్రికి దుప్పట్ల వితరణ



డాక్టర్ ప్రవీణ్‌కు దుప్పట్లను అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్ల బెడ్స్‌కు సంబంధించిన దుప్పట్లను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం అందజేశారు. తన సొంత ఖర్చులతో సమకూర్చిన దుప్పట్లను ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వైద్యులకు సూచించారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మండపేట: శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో మండపేట విద్యార్థులు తమ ప్రతిభను చూపారు. ఈ నెల 14 నుంచి 16 వరకూ పలాసలో జరిగిన జూనియర్ బాలబాలికల పోటీల్లో వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. నీలం గౌతమ్, సంజయ్‌ల మొదటి స్థానాలు సాధించారు. కేఎస్ ప్రసాద్ రెండో స్థానంలో నిలిచారు. బల్ల సత్యనారాయణకు ఐదో స్థానం సంపాదించాడని కోచ్ కుంచె రమేష్ తెలిపారు. ఈ నెల 30న జమ్మూకాశ్మీర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని రమేష్ చెప్పారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ వైడీ రామారావు, జిల్లా ప్రెసిడెంటు ఏ కృష్ణకుమారి, స్కూల్ హెచ్ఎం నాగకుమార్ తదితరులు అభినందించారు.

వరద బాధితులకు సాయం



వరద బాధితుల కోసం ప్రత్యేక వాహనంలో విజయవాడ తరలిస్తున్న నిత్యావసర సరకులు

కె.గంగవరం: గ్రామానికి చెందిన చిన్నమంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సాయం అందించారు. స్థానికంగా గల చిన్న మందా చర్చి ఆవరణలో పాస్టర్ సలాది జెకర్య సుమారు రూ.6 లక్షలు విలువ చేసే నిత్యావసర సరకులు, దుప్పట్లు, చీరలు, దుస్తులను సమకూర్చారు. వీటిని విజయవాడలో సుమారు 500 మంది బాధిత కుటుంబాలకు అందిస్తామని పాస్టర్ జెకర్య తెలిపారు. గతంలో కూడా చిన్న మంద ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక వాహనాలపై వస్తువులను విజయవాడ తరలించి సోమవారం బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలిజబెత్, పరిమళ గ్రేస్, చిన్న మంద సంఘం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బాబులు కుటుంబానికి ఎమ్మెల్సీ తోట పరామర్శ



బందనపూడిలో బాబులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కాజులూరు: మండలంలోని బందనపూడిలో సతీ వియోగంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ తలాటం వెంకటేశ్వరరావు (బాబులు), అతని కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. బాబులు భార్య తలాటం రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాబులును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మతుకుమిల్లి సర్పంచ్ పెట్టా వీరనాయుడు, మాజీ సర్పంచ్ జక్కన రాజేష్, మండ గోవిందురెడ్డి, డేగల నాగేంద్ర, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురం ప్రధాన రహదారిలో స్వామివారి ఊరేగింపు



రామచంద్రపురంలోని కోరంగి కెనాల్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



కోటిపల్లిలోని గౌతమి గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భారీ వినాయక విగ్రహాన్ని పడవపై తీసుకువెళ్తున్న భక్తులు



కోటిపల్లి గోదావరిలో వినాయక విగ్రహం నిమజ్జనం

బై బై గణేశా..

- కోలాహలంగా గణపతి నిమజ్జనాలు
- జనసంద్రంగా మారిన కోటిపల్లి
- మొదటి రోజు 300 విగ్రహాల నిమజ్జనం



గణపతి ఊరేగింపులో చిన్నారుల కోలాట ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: గణపతి నవరాత్రులు ముగియడంతో సోమవారం స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. మండలంలోని వెలంపాలెం, కంబాల చెరువు, ద్రాక్షారామ ఆటోస్టాండ్, జగన్నాయకులపాలెం, తాళ్లపొలం, శుక్రవారపుపేట, బియ్యంపేట, ఉండూరు, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో నెలకొల్పిన గణేశ్ విగ్రహాలను తీన్‌మార్, కర్రసాములు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి కోటిపల్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. కొన్ని గ్రామాల్లోని వినాయకుని ప్రతిమలను వెల్ల ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

రామచంద్రపురం: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో నియోజకవర్గంలో సోమవారం గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. పట్టణంలో నెలకొల్పిన వినాయక విగ్రహాలను స్థానిక కోరంగి కాలువ వద్ద నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి నిమజ్జన మహోత్సవాలను నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. ప్రధాన రహదారిలోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి ద్రాక్షారామ రోడ్డులోని వెల్లవంతెన వరకూ ఊరేగింపులు కొనసాగాయి. ఆటోలు, ట్రాక్టర్లు, లారీల్లో విగ్రహాలను పెట్టి గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ కర్రసాములు, వివిధ నత్యాలతో స్వామివారిని ఊరేగించారు. పెద్ద వంతెన వద్దకు చేరుకుని కోరంగి కెనాల్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామచంద్రపురం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని మండపాల వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కె.గంగవరం: గణపతి నవరాత్రులు ముగియడంతో ఊరూవాడా నిమజ్జనాల సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న స్వామివారిని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం ఉదయం నుంచి నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం, రామచంద్రపురం రూరల్ మండలాల్లో నెలకొల్పిన గణేశ్ విగ్రహాలను కోటిపల్లిలోని గౌతమి గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. దీంతో కోటిపల్లి గ్రామం కోలాహలంగా మారింది. గ్రామ ప్రారంభం నుంచి రేవు వరకూ బ్యాండ్ బాజాలు, నృత్యాలు, బాణసంచా కాల్పులతో భారీ ఊరేగింపుగా రేవులోకి చేరుకుని స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై జానీబాషా బందోబస్తు నిర్వహించారు. నిమజ్జనానికి తరలివస్తున్న భారీ వినాయక విగ్రహాలను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో కోటిపల్లి-కె.గంగవరం రహదారి జనసంద్రంగా మారింది. సోమవారం ఒక్క రోజే కోటిపల్లిలో సుమారు 300 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు

కోటిపల్లిలోని గౌతమి గోదావరి నది వద్ద పంచాయతీ సిబ్బంది, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి ఫెర్రి వద్ద గల పుష్కర ఘాట్లలో ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను నియమించి నిర్దేశించిన లోతు వరకూ పడవలను అడ్డుపెట్టి పహారా కాస్తున్నారు. రేవులోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అనారోగ్యానికి గురైన భక్తులకు వైద్యం అందించారు.

కాజులూరు: మండల వ్యాప్తంగా సోమవారం గణపతి నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో మండలంలోని గొల్లపాలెం, మొగలిపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి, కోలంక తదితర గ్రామాల్లో నెలకొల్పిన స్వామివార్ల విగ్రహాలను కోలాటం, డీజే, తీన్‌మార్, బాణసంచా కాల్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించి తుల్యభాగ, ఆత్రేయ గోదావరి, పంట కాలువల్లో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువత రంగులు చల్లుకుని, డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. మొగలిపాలెంలో భారీ అన్నదానం నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి, వాకతిప్ప గౌతమి గోదావరి పుష్కర రేవుల్లో నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో భక్తులను లోపలికి అనుమతించకుండా అధికారికంగా ఏర్పాటు చేసిన పడవలు ద్వారా నిమజ్జనానికి అనుమతించారు. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం, వడ్లమూరు నేలటూరు కోరుమిల్లి, మాచర, నాగులచెరువు, అద్దంకివారిలంక, కేదారిలంక తదితర గ్రామాల్లోని నవరాత్ర ఉత్సవాల శిబిరాల నుంచి వైభవంగా ఊరేగింపుతో గోదావరి తీరానికి తరలించారు. గోదావరి నది ఘాట్‌లతో పాటు వెదురుమూడి, కాలేరు, అంగర తదితర గ్రామాల్లోని పంట, మురుగు కాలువల రేవుల్లో నిమజ్జనాలు చేశారు.

పట్టణంలో అన్నదానాలు

మండపేట: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో మండపేట పట్టణంలో ఉత్సవ కమిటీలు అన్నదాన కార్యక్రమాలు చుట్టారు. గాంధీనగర్ కొండయ్య బీడులో డ్రాగన్‌యూత్ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి మంటపం వద్ద సోమవారం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు) ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదానం ప్రారంభించారు. ఆ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నీలం దుర్గమ్మ పాల్గొన్నారు. గాంధీనగర్, పార్థసారథి నగర్ వీధుల్లో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో కోళ్ల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పోలుబోతు గణేష్, పందిరి ప్రసాద్, గౌహార్, వెంకటేష్ పాల్గొన్నారు.



మొగలిపాలెంలో నిమజ్జనానికి ట్రాక్టర్లపై ఊరేగింపుగా వెళుతున్న గణనాథులు



కాలేరులోని కోరంగి కెనాల్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

రాయవరం: గణపతి నవరాత్ర ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. వాడవాడలా ఏకదంతుడి నిమజ్జనోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. మండలంలో రాయవరం, లొల్ల, మాచవరం, సోమేశ్వరం, వెదురుపాక, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించి ఆయా గ్రామాల్లో కాలువల్లో వినాయకుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు వినాయకుడి వేషధారణలతో హల్‌చల్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలి

మండపేట: గణనాథ విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కే సత్యనారాయణమూర్తి తెలిపారు. సోమవారం గణపతి నిమజ్జనాల సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి రమణ, సిబ్బందితో కలిసి మండలంలోని పలు కాలువలను పరిశీలించారు. కేశవరం, ద్వారపూడి, జెడ్ మేడపాడు, వెలగతోడు, ఏడిద సీతానగరం కాలువల వద్ద వున్న రేవులను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అపశృతి జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

17 నుంచి భారత్ స్వచ్ఛతాహి ..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛతా హి కార్యక్రమాలను ఈ నెల మంగళవారం ప్రారంభమవుతాయని ఎంపీడీవో సత్యనారాయణమూర్తి మీడియాకు తెలిపారు. ఈకార్యక్రమం వచ్చే నెల ఒకటో తేదీ వరకూ నిర్వహిస్తామని తెలిపారు. అంతా పరిశుభ్రం చేయాలన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



పెదలంక పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు

కాజులూరు: ప్రస్తుతం వర్షాలు, వరదల నేపథ్యంలో పశు సంరక్షణపై రైతులు ప్రతేక శ్రద్ధ వహించాలని కాకినాడ జిల్లా పశు వైద్యశాఖ సంచాలకులు అంబేడ్కర్ సూచించారు. మండలంలోని పెద్దలంకలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా పశువులకు అనేక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. వాటిపై రైతులకు అవగాహన కల్పించటంతో పాటు పశుగర్భ కోశ వ్యాధులకు చికిత్స అందించేందుకు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, పశువ్యాధుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు సహాయ సంచాలకులు డాక్టర్ బ్రహ్మవేద, పశువైద్యాధికారులు చింతా శ్రీనివాస్, సుధీర్, రామకోటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

రామచంద్రపురం రూరల్: వివాదంలో ఉన్న శ్రీపీవీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణం స్థలంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం శ్రీకారం చుట్టారు. గతంలో ఇదే స్థలంలో తమకు కనీస సమాచారం ఇవ్వకుండా గడ్డిని తొలగించినందుకు పీవీఆర్ హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు పైడా సత్యప్రసాద్ కొందరిపై కేసు పెట్టారు. ప్రస్తుతం గుబురుగా పెరిగిన గడ్డిని జేసీబీతో మంత్రి సుభాష్ అనుచరులు శుభ్రం చేయించారు. ఈ పనులను మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ద్రాక్షారామ నడిబొడ్డున ఉన్న ఈ స్థలాన్ని అభివృద్ధి చేసి క్రీడా ప్రాంగణంలో యువకులు ఆడుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు, డాక్టర్ రాంబాబు, ముప్పనపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్–ఉన్– నబీ వేడుకలు



వెదురుపాక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రామచంద్రపురం: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పెద్ద మసీదు నుంచి నిర్వహించిన జల్సా (ఊరేగింపు) కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ముస్లింలతో కలిసి మంత్రి సుభాష్ నడిచారు. అనంతరం ముస్లిం పెద్దలు మంత్రి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు.

మానవ జాతి సన్మార్గమే లక్ష్యం

కపిలేశ్వరపురం: సమాజంలో నెలకొన్న అశాంతి పరిస్థితులను చక్కదిద్ది సన్మార్గాన నడిపించిన చివరి ప్రవక్త మహమ్మద్ (స) జన్మదినమే మిలాద్-ఉన్-నబీ అని ఇస్లాం మత ప్రబోధకులన్నారు. మండలంలోని అంగర మస్‌జిద్-ఎ-ఇబ్రాహీమలో సోమవారం ముతవల్లి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, ఇమామ్ మహమ్మద్ నాజీం అక్తర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ సల్లెల్లాహు ఆలైహివ సల్లెం జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో గ్రామంతో పాటు సమీప గ్రామాల ముస్లింలు హాజరయ్యారు.

రామచంద్రపురం రూరల్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ద్రాక్షారామలో ముస్లింలు సోమవారం ఈద్ మీలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మార్కెట్ జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో జెండాలు చేతబూని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెలంపాలెం షాబాజియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి జాఫర్ హుస్సేన్, రామచంద్రపురం మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు.

వేడుకగా మిలాద్ ఉన్ నబీ

రాయవరం: మహమ్మద్ ప్రవక్త సమస్త మానవాళికి మార్గదర్శకులని పలువురు ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. మండలంలోని పలు మసీదుల్లో మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ముస్లిం సోదరులు సోమవారం మిలాద్-ఉన్-నబీ ఘనంగా నిర్వహించుకున్నారు. మానవులంతా ఒక్కటేనని, విశ్వాన్ని సృష్టించిన దైవాన్ని, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని మత పెద్దలు బోధించారు. మండలంలోని వెదురుపాక మసీదు అధినేత షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని రామచంద్రపురం మండల ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లు, పీఈటీలు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్ టైం స్కేల్ అమలు చేయాలని, హెచ్ఆర్ఏ, డీఏ అమలు చేసి వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయాలని కోరారు. అనంతరం హసన్‌బాద డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను వేసిన మంత్రి చిత్రపటాన్ని ఆయనకు అందించారు. కార్యక్రమంలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పార్వతి, అపర్ణ, శ్రీదేవి, త్రినాథప్రసాద్, సత్యనారాయణ, నాగార్జున, మురళి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ రామకృష్ణ, ఎస్సై లక్ష్మణ్

రామచంద్రపురం రూరల్: ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన నేషనల్ షోటోకాన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ -2024 (బడేటి కప్) పోటీల్లో మండలంలోని ద్రాక్షారామ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్టు కరాటే మాస్టర్ బీకే రత్నం తెలిపారు. సీనియర్ స్పారింగ్ విభాగంలో పి.కిషోర్ బంగారు పతకం సాధించగా జూనియర్ స్పారింగ్ విభాగంలో కె.విష్ణు, ఎ.సంతోష్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ పెండ్ర బాలకృష్ణను రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి తదితరులు అభినందించారు.

నులిమేద్దాం

- ఆరోగ్యానికి 'ఆల్బెండజోల్' అవసరం
- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- రెండు నియోజకవర్గాల్లో 82,044 మందికి అందజేత



కపిలేశ్వరపురం పాఠశాలలో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్యాధికారి (ఫైల్)

కపిలేశ్వరపురం: చిన్నారుల ఆరోగ్యం పోషక విలువలున్న ఆహారంపై ఆధారపడి ఉంటుంది. ఆహారంతో పాటు తీసుకున్న ఆహారం ఒంట బట్టాలంటే జీర్ణ వ్యవస్థ బాగుండాలి. పొట్టలో పురుగులుంటే చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. వాటిని నులిమేసేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నులిపురుగుల నివారణే లక్ష్యంగా 19 సంవత్సరాలు లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు క్షేత్ర స్థాయిలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది సన్నద్ధమయ్యారు. అయితే వైద్యాధికారులు సమ్మెలో ఉండడంతో పంపిణీ కార్యక్రమంపై పర్యవేక్షణ లోపం వెంటాడుతోంది. రెండు నియోజకవర్గాల్లోని చిన్నారుల్లో రక్త హీనత నివారణే లక్ష్యంగా సాగుతున్న కార్యక్రమంపై ఈ కథనం

కార్యక్రమ లక్ష్యమిదీ

నులి పురుగుల ప్రభావం కారణంగా తలెత్తే రక్తహీనత నివారణ లక్ష్యంగా ఏడాదిలో ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలైన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. ఫిబ్రవరి 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. ఈ ఏడాదిలో రెండో విడతగానూ, విద్యా సంవత్సరంలో రెండో విడతగానూ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నారు. 19 ఏళ్ల లోపు చిన్నారులకు మాత్రలను అందజేస్తారు. వైద్య, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మాతాశిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్‌ల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నారు.

రెండు నియోజకవర్గా కార్యక్రమం సాగేదిలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 17 పీహెచ్‌సీలకు చెందిన 826 సంస్థల్లో 82,044 మందికి మాత్రలను పంపిణీ చేయనున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ఎనిమిది పీహెచ్‌సీల్లోని 395 సంస్థల్లోని 34,966 మందికి మాత్రలను పంపిణీ చేయనున్నారు. మండపేట నియోజకవర్గంలోని 9 పీహెచ్‌సీల్లోని 431 సంస్థల్లోని 47,078 మంది చిన్నారులకు మాత్రలను పంపిణీచేయనున్నారు.

అవగాహన అవసరం

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో మింగాలి. 2 ఏళ్ల లోపు చిన్నారులు సగం మాత్రను నీటిలో కరగబెట్టి మింగాలి.

	పీహెచ్‌సీ	పంపిణీ చేయాల్సిన సంస్థలు	బాలురు	బాలికలు	మొత్తం
ఆర్సీపురం	హరిజపేట అర్బన్ పీహెచ్‌సీ	33	2220	2007	4227
ఆర్సీపురం	ముచ్చిమిల్లి అర్బన్ పీహెచ్‌సీ	40	4354	4035	8389
వెల్ల		26	1286	1449	2735
ద్రాక్షారామ		83	4678	3749	8427
పామర్రు		55	1421	1444	2865
పేకేరు		57	1022	1080	2102
దంగేరు		46	1018	1175	2193
కుందూరు		55	2175	1853	4028
మండపేట	హరిజనపేట అర్బన్ పీహెచ్‌సీ	25	3194	3499	6693
మండపేట	గొల్లపుంత అర్బన్ పీహెచ్‌సీ	32	4215	3482	7697
డి.కేశవరం		63	2822	2798	5620
ద్వారపూడి		81	4053	3972	8025
అంగర		52	1895	2143	4038
అచ్యుతాపురం		38	1051	1065	2116
వాకతిప్ప		41	1144	1297	2441
మాచవరం		75	2594	2411	5005
రాయవరం		24	2697	2746	5443
మొత్తం		826	41,839	40,205	82,044

ఆపైబడిన వారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశాలున్నందున ఆహారం తీసుకున్న తర్వాతనే మింగాలి.

మండలాల వారీగా..

రామచంద్రపురం అర్బన్‌లోని రెండు పీహెచ్‌సీల పరిధిలో 73 సంస్థల్లో 12,616 మందికి, రామచంద్రపురం రూరల్ మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలోని 109 సంస్థల్లోని 11,162 మంది చిన్నారులకు మాత్రలను అందజేయనున్నారు. కె.గంగవరం మండలంలోని నాలుగు పీహెచ్‌సీల్లోని 213 సంస్థల్లోని 11,188 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. మండపేట అర్బన్‌లోని రెండు పీహెచ్‌సీల్లోని 57 సంస్థల్లోని 14,390 మంది చిన్నారులకు, మండపేట రూరల్ మండలంలోని రెండు పీహెచ్‌సీల్లోని 144 సంస్థల్లో 13,645 మంది చిన్నారులకు, కపిలేశ్వరపురం మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలోని 131 సంస్థల్లో 8,595 మందికి, రాయవరం మండలంలో రెండు పీహెచ్‌సీల్లోని 99 సంస్థల్లోని 10,448 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేయనున్నారు.

సిబ్బంది ఇలా..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 17 పీహెచ్‌సీల పరిధిలోని మొత్తం 667 సంస్థల్లో 82,044 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖలు సన్నద్ధమయ్యాయి. అందుకోసం 904 మంది ఆశ, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొననున్నారు. వారిలో 135 మంది ఏఎన్ఎంలు, 337 మంది ఆశ కార్యకర్తలు, 432 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.